సాక్షి
నిర్మల్

శనివారం। 19 । ఆగస్టు । 2023

గరిష్ఠం/కనిష్ఠం
24.2 /23.6

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. అల్పపీడన ప్రభావంతో జిల్లా అంతటా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

చెదరని జ్ఞాపకం



ఒక్క ఫొటో.. ఎన్నో జ్ఞాపకాలు కదలాడుతాయి. కాలం గిర్రున తిరుగుతున్నా.. ఫొటో చూడగానే ఏళ్లనాటి దృశ్యాలు మనసులో మెదులుతాయి. నాటి జ్ఞాపకంలోకి మనల్ని తీసుకెళ్తాయి. జ్ఞాపకాలను పదిలంగా ఉంచేది ఫొటో మాత్రమే. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు..

- వివరాలు 8లో▸

న్యూస్‌రీల్

లక్ష్యాన్ని చేరుకోవాలి



పరిశీలిస్తున్న అమర్‌సింగ్‌నాయక్

భైంసా: వైద్య సిబ్బంది అంకిత భావంతో పని చేసి లక్ష్యాన్ని చేరుకోవాలని మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అదనపు డైరెక్టర్ అమర్‌సింగ్‌నాయక్ అన్నారు. బాసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామంలోని పలు వార్డులలో మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్‌ను శుక్రవారం పరిశీలించారు. జిల్లాలోని వైద్యాధికారులతో మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ పై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 100 శాతం లక్ష్యాన్ని సాధించడానికి సలహాలు సూచనలను ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్, డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్, డాక్టర్ ఇద్రిస్, డాక్టర్ రాజారమేశ్, డాక్టర్ ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి రద్దు

నిర్మల్‌టౌన్: ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగం ఈనెల 21న నిర్వహించడం లేదని డీఆర్వో లోకేశ్ శుక్రవారం తెలిపారు. అదే రోజు ఎక్సైజ్ శాఖ టెండర్ ప్రక్రియ ఉండడంతో వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు గమనించి సహకరించాలని సూచించారు.

కలెక్టర్, ఎస్పీని కలిసిన నిర్మల్ డీఎం

నిర్మల్‌టౌన్: ఆర్టీసీ నిర్మల్ డిపో మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రతిమరెడ్డి శుక్రవారం కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌ను వారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందజేశారు. డీఎం వెంట ఆర్టీసీ సిబ్బంది ఉన్నారు.

కుష్ఠు సర్వేను పరిశీలించిన డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధి



పొన్కల్‌లో సర్వేను పరిశీలిస్తున్న ప్రతినిధి దివ్య

మామడ: మండలంలోని పొన్కల్, కమల్‌కోట్, పోతారం, న్యూసాంగ్వి, దిమ్మదుర్తి గ్రామాల్లో కుష్ఠు వ్యాధి గుర్తింపు సర్వే, బోధకాలు నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాలను ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి దివ్య శుక్రవారం పరిశీలించారు. వైద్య సిబ్బంది చేపట్టిన సర్వే వివరాలు తెలుసుకున్నారు. ఆమె వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్, సూపర్‌వైజర్ కన్నయ్య, పద్మ వైద్యసిబ్బంది ఉన్నారు.

సెకండ్ ఏఎన్‌ఎంల వినూత్న నిరసన



నిరసన తెలుపుతున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

నిర్మల్‌టౌన్: తమను రెగ్యులరైజ్ చేయాలని జిల్లా కేంద్రంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు శుక్రవారం మోకాళ్లపై నిల్చుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. తర్వాత శ్రావణ శుక్రవారం సందర్భంగా సమ్మె శిబిరంలోనే వరలక్ష్మి పూజలు చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని సెకండ్ ఏఎన్ఎంలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 12వ రోజుకు చేరుకుంది. ఎలాంటి పరీక్ష నిర్వహించకుండా తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని తెలిపారు.

క్షీణిస్తున్న 'ఏలేటి' ఆరోగ్యం




ఏలేటిని పరీక్షిస్తున్న వైద్యులు

నిర్మల్: మాస్టర్‌ప్లాన్ రద్దు చేయాలంటూ ఆమరణ నిరాహారదీక్ష చేపట్టిన బీజేపీనేత, మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తోందని వైద్యులు తెలిపారు. తన నివాసంలోనే ఏలేటి దీక్ష చేపట్టి మూడురోజులు దాటింది. ఈనేపథ్యంలో ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులు రఘునందన్‌రెడ్డి, బీజేపీ నేత, డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పరీక్షించారు. గంటగంటకు ఆయన ఆరోగ్యం క్షీణిస్తోందని పేర్కొన్నారు.

ప్లాన్‌కు లైన్ క్లియర్!?

- అమలుకు జీవో 220 జారీ
- రద్దు చేయాలని 'ఏలేటి' దీక్ష
- నేతల రాకతో బీజేపీలో జోష్..
- నేడు సంఘీభావం తెలుపనున్న 'బండి'
- రైతులకు మద్దతుగా కాంగ్రెస్ నేతలు



నిర్మల్ కొత్త మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్

నిర్మల్: నిర్మల్ మున్సిపల్ మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్‌పై ఓవైపు చర్చ జరుగుతుండగా, తాజాగా జీవో 220 తెరపైకి వచ్చింది. గత డిసెంబర్ 3న అమలులోకి తీసుకువచ్చిన ఈ జీవోనే కొత్త బృహత్ ప్రణాళిక అమలుకు లైన్ క్లియర్ అయిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. మాస్టర్‌ప్లాన్ రద్దు చేశామని ప్రజలను మభ్యపెడుతూ రహస్యంగా జీవో జారీ చేసిందని విపక్షాలు, రైతులు మండిపడుతున్నారు. బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఈ జీవో రద్దు చేయాలని మూడు రోజులుగా ఆమరణ దీక్ష చేస్తున్నారు. ఏలేటికి సంఘీభావం తెలిపేందుకు వరుసగా బీజేపీ అగ్రనేతలు నిర్మల్‌కు వస్తుండడంతో పార్టీ శ్రేణుల్లో జోష్ నింపుతోంది. మరోవైపు శుక్రవారం నుంచి కాంగ్రెస్ కూడా దూకుడు పెంచింది. అధికార బీఆర్ఎస్‌తోపాటు బీజేపీపైనా ఆరోపణలు గుప్పిస్తోంది. అధికార బీఆర్ఎస్ మాత్రం ఇది డ్రాఫ్ట్ మాత్రమేనని అభ్యంతరాల మేరకు మార్పులు ఉంటాయని పేర్కొంటోంది.

25 ఏళ్లు అమలులో..

నిర్మల్ పట్టణం, పరిసర ప్రాంతాల క్రమబద్ధమైన అభివృద్ధి కోసం ప్రణాళికబద్ధంగా మాస్టర్ ప్లాన్ రూపొందించినట్లు జీవో 220లో పేర్కొన్నారు. మొత్తం 33.81 చదరపు అడుగుల విస్తీర్ణంలో 94,944 మంది జనాభా కోసం 25 ఏళ్లు ఈ ప్లాన్ అమలులో ఉంటుంది. నిర్మల్ మున్సిపల్ కౌన్సిల్ తీర్మానంతోపాటు అధికారిక ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపారు. టౌన్, కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ సమర్పించిన ప్రతిపాదనను నిశితంగా పరిశీలించిన తర్వాత అధికారికంగా ఆమోదం వచ్చింది. ఇందులో ప్రధానంగా కొత్త ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్‌ను ఫైనల్‌గా ప్రభుత్వం ఆమోదించే వరకు, దానిలో ఉన్న నిబంధనలనే అనుసరించాలని పేర్కొన్నారు. దీని ఆధారంగానే జోన్లను ఇష్టారీతిన మార్చారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఏడు నెలల క్రితం చేసిన ఆందోళనలతో రద్దు చేసినట్లు ప్రకటించినప్పుడు ఈ జీవోను బహిర్గతం చేయకుండా అమలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జీవో రద్దు చేయాలని..

మాస్టర్‌ప్లాన్ అమలుకు కారణమైన జీవో 220ని వెంటనే రద్దు చేయాలని, ప్రజలకు అనుగుణంగా రూపొందించాలని ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్‌లు ఆందోళన చేస్తున్నాయి. మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి చేపట్టిన ఆమరణ దీక్షకు ఈటల రాజేందర్, రఘునందర్‌రావు సంఘీభావం తెలిపారు. శనివారం బండి సంజయ్ రానున్నట్లు పార్టీ ప్రకటించింది. శుక్రవారం నిర్మల్ బంద్ కూడా చేపట్టింది. మరోవైపు డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ఈ జీవో రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

మార్పులు, చేర్పులు..

ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్లుగా మాస్టర్‌ప్లాన్ అమలు చేయడం లేదని, ప్రజలు, రైతుల అభ్యంతరాల మేరకు మార్పులు ఉంటాయని అధికార బీఆర్ఎస్ చెబుతోంది. గతంలో వచ్చిన అభ్యంతరాల మేరకు కట్టుబడి మా ర్పులు, చేర్పులు చేపడతామంటోంది. ఈ మొత్తం వ్యవహారంలో మాస్టర్‌ప్లాన్ బాధితులుగా ఉన్న రైతులు సైతం ఆందోళన బాట పట్టారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట శుక్రవారం రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారు.

బహుజనుల కోసం పోరాడిన వీరుడు పాపన్న

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



పాపన్నగౌడ్‌కు వరుణ్‌రెడ్డి, నర్సాగౌడ్ నివాళి..

నిర్మల్‌టౌన్: బహుజనుల హక్కుల కోసం పోరాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో పాపన్నగౌడ్ 373వ జయంతిని శుక్రవారం అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్నగౌడ్ చిత్రపటానికి మోకు దెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్‌తో కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడు తూ.. బడుగు బలహీనవర్గాల ప్రజల కోసం 350 సంవత్సరాల క్రితమే పోరాడిన మహనీయుడు పాపన్నగౌడ్ అని కొనియాడారు. మొగలాయిల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించి బడుగుల కు రాజ్యాధికారాన్ని సాధించిన భారత దేశ మొట్ట మొదటి విప్లవ వీరుడు పాపన్న అని తెలిపారు. పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తితో ఐక్యంగా ఉద్యమించి హక్కులు సాధించుకోవాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న పాపన్నగౌడ్ విగ్రహం వద్ద మోకు దెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, బీసీ వెల్ఫేర్ అధికారి రాజేశ్వర్‌గౌడ్, మోకుదెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగాగౌడ్, ప్రచార కార్యదర్శి రాజాగౌడ్, నాయకులు బాలాగౌడ్, శ్రీశైలంగౌడ్, పొన్నం శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కుట్రపూరితంగానే జీవో 220 అమలు

- స్కాముల మంత్రి, సండే నేతల మోసం
- అధికారంలోకి రాగానే 'ప్లాన్' రద్దు
- డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

నిర్మల్: స్కాముల మంత్రి, సండే నేత కలిసి ప్రజలను మోసం చేస్తున్నారని, కుట్రపూరితంగా మాస్టర్ ప్లాన్‌ను అమలు చేసేందుకే జీవో 220 తీసుకువచ్చారని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే ప్రజలను ఇబ్బంది పెట్టేలా ఉన్న మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేస్తామని చెప్పారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో శుక్రవారం మాట్లాడారు. నువ్వు కొట్టినట్లు చేయు, నేను ఏడ్చినట్లు నటిస్తా.. అన్న చందంగా మంత్రి, మహేశ్వర్‌రెడ్డి వ్యవహారం నడుస్తోందని ఆరోపించారు. తాను ఇన్నేళ్లు బీఆర్ఎస్‌లో ఉన్నందున ప్రశ్నించలేకపోయానని చెప్పారు. ప్రతిపక్షనేతగా ఉన్న మహేశ్వర్‌రెడ్డి ఇంతకాలం ఎందుకు మాస్టర్‌ప్లాన్‌పై మాట్లాడలేదని ప్రశ్నించారు. ఎన్నికల నేపథ్యంలోనే డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. మున్సిపల్‌లో 42 పోస్టులనూ మంత్రి, చైర్మన్ అమ్ముకున్నారని ఆరోపించారు. బాధితులకు తిరిగి డబ్బులు చెల్లించి, అర్హులతో భర్తీచేయాలని డిమాండ్ చేశారు.

మోసం చేశారు..

నిర్మల్ మున్సిపాలిటీలో ప్రజలు, రైతుల నుంచి అభ్యంతరాలు వచ్చిన తర్వాత మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారని శ్రీహరిరావు గుర్తు చేశారు. కానీ కుట్రపూరితంగా గత ఏడాది డిసెంబర్‌లోనే సదరు మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్టును అమలు చేసేలా జీవో 220 తీసుకొచ్చి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. సోఫీనగర్‌లోని ఇండస్ట్రీయల్‌జోన్‌లో ఉన్న భూములను మంత్రి తోబుట్టువు కొనుగోలు చేసి ఓ కార్పొరేట్ సంస్థకు విక్రయించారన్నారు. దిలావర్‌పూర్–గుండంపల్లి మధ్య ఇథనాల్ ఫ్యాక్టరీ విషయంలోనూ మంత్రి అల్లోల, ప్రతిపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి రైతులకు అన్యాయం చేసేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఫ్యాక్టరీ నిర్మాణానికి బీజేపీ నేత అనుచరులే భూములు కొనుగోలు చేయించారన్నారు. రాష్ట్ర పర్యావరణశాఖ మంత్రిగా ఉన్న ఇంద్రకరణ్‌రెడ్డికి ఇథనాల్ ఫ్యాక్టరీకి అనుమతులు ఎలా వచ్చాయో తెలియదని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఫ్యాక్టరీ నిర్మాణం రద్దు చేయాలని రెండు గ్రామాల సర్పంచులు ఎందుకు తీర్మానం చేయడం లేదని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో మంత్రి, మహేశ్వర్‌రెడ్డికి ప్రజలు గుణపాఠం చెబుతారని అన్నారు. సమావేశంలో పీసీసీ సభ్యుడు సాద సుదర్శన్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ వాజిద్ అహ్మద్ ఖాన్, నాయకులు పొడెల్లి గణేశ్, నాందేడపు చిన్ను, ఎంబడి రాకేశ్, రమణారెడ్డి, ఖీజర్ తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు.. కట్టడి

- రంగంలోకి 557 వైద్య బృందాలు
- అనుమానితుల గుర్తింపు కోసం సర్వే
- ఈనెల 31 వరకు అధికారుల పర్యటన



కుష్ఠు వ్యాధిపై సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

నిర్మల్‌చైన్‌గేట్: కుష్ఠు వ్యాధి కట్టడే లక్ష్యంగా ప్రభుత్వం సమరం మొదలు పెట్టింది. గతంతో పోల్చుకుంటే వ్యాధి తీవ్రతతోపాటు బాధితులు తగ్గిపోయారు. మిగిలిన కొద్దిపాటి కేసులను కూడా అరికట్టడానికి జాతీయ వైద్య ఆరోగ్య మిషన్ ద్వారా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రత్యేక సర్వేకు సిద్ధమైంది. ఇందులో భాగంగా జిల్లాలో ఈనెల 16 నుంచి ఇంటింటా లెప్రసీ సర్వే చేస్తోంది. జాతీయ 'కుష్ఠు' నిర్మూలన కార్యక్రమాన్ని 1983లో కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. దేశ వ్యాప్తంగా ఉన్న ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 'కుష్ఠు' విభాగాన్ని అందుబాటులోకి తెచ్చింది. వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించడం. వారికి మందులు పంపిణీ చేయడం, వ్యాధి తగ్గేవరకు పర్యవేక్షించడం వంటివి లక్ష్యంగా నిర్దేశించుకుంది.

జిల్లాలో 82 మంది..

జిల్లాలో గతంలో కంటే కుష్ఠు వ్యాధి తగ్గుతోంది. ప్రస్తుతం 82 మంది బాధితులు ఉన్నారు. 2021–22 సంవత్సరం 52 కేసులు రాగా, 2022–23 సంవత్సరం 60, ఈ సంవత్సరం జులై వరకు 33 మందిని గుర్తించారు. వీరికి అవసరమైన మందులు ఇచ్చారు. శాశ్వత అంగవైకల్యానికి గురికాకుండా అవసరమైన వారికి హైదరాబాద్‌లో శస్త్ర చికిత్స కూడా చేయిస్తున్నారు. ఆపరేషన్ తర్వాత బాధితులకు పౌష్టికాహారం, ఇతర అవసరాలకు రూ.5 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ప్రభుత్వ పరంగా పింఛన్లతోపాటు ఎంసీఆర్ చెప్పులు, మందుల కిట్లు పంపిణీ చేస్తున్నారు.

లెప్రసీకి కారణాలు.. లక్షణాలు

కుష్ఠు మైక్రో బాక్టీరియం లేప్రే అనే బాక్టీరియాతో వస్తుంది. ఒకరి నుంచి ఒకరికి అంటుకోదు. వ్యాధి క్రిములు శరీరంలోకి ప్రవేశించిన తరువాత రెండు నుంచి ఏడు రోజుల్లో వ్యాధి లక్షణాలు బయటపడుతాయి. ఈ వ్యాధితో చర్మం, మ్యూకస్ మెంబ్రేన్ నరాలు రోగానికి గురవుతాయి. రోగ నిరోధకశక్తిని బట్టి లక్షణాలు మారుతుంటాయి. రోగి సరైన జాగ్రత్తలు తీసుకోకుండా ఉంటే దుమ్ము ధూళి, ఊపిరిద్వారా లోపలికి చేరుకుని రోగ నిరోధకశక్తి తగ్గుతుంది. వ్యాధిని చాలా ముందుగా తేలికగా తెలుసుకోవచ్చు. రంగు తగ్గిన మచ్చలు, చుట్టూ ఉన్న చర్మంతో పోలిస్తే మచ్చలు పాలిపోయినట్లు ఉంటాయి. మచ్చలు గుండ్రటి ఆకారంలో ఉంటాయి. వేడి, నొప్పి, స్పర్శ తెలియవు. ప్రధానంగా స్పర్శ జ్ఞానం కనిపించదు. చర్మం మీద మచ్చలు ప్రాంతానికి వచ్చే నాడులు వాపు తేలడం, మోకాలి వెలుపల పక్కన, మోచేయి లోతట్టున, మెడలోనూ లావెక్కిన నాడులు తెలుస్తాయి. నాడులు వాయడం జరుగుతుంది. నొప్పి, దురద, పుండ్లు వచ్చి మానకపోవడం, ముఖం మీద చర్మం మందంగా తేలి ఉండడం, కనుబొమ్మలు వెంట్రుకలు రాలిపోవడం, పాదాలు, చేతులు శక్తి హీనమై వంకరలు తిరుగుతుంటాయి. తెల్లమచ్చలు ఉన్నచోట స్కిన్ క్లిప్ పరీక్ష చేసి క్రిములను గుర్తించి వైద్యాన్ని అందిస్తారు. కుష్ఠు లక్షణాలు ఉన్నవారు కంటి విషయంలో, అవయవాలపై జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రస్తుతం వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా సురక్షితమైన మందులను అందిస్తున్నారు. ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించి చికిత్స ప్రారంభిస్తే ఆరు నెలల నుంచి 12 నెలల్లో పూర్తిగా నయమవుతుంది. రెండు లేక మూడు ఔషధాల కలయిక అయిన బహుళ ఔషధ చికిత్స(ఎండీటీ) చేస్తారు. ఈ చికిత్స అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో పూర్తిగా ఉచితంగా లభిస్తుంది.

వివరాలు...

మొత్తం కుటుంబాలు	1,74,491
టీంలు	557
టీం మెంబర్స్	1,114
సూపర్‌వైజర్స్	115
2021–22	52 కేసులు
2022–23	60 కేసులు
2023, జూలై	33 కేసులు

పకడ్బందీగా సర్వే



ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా వైద్య సిబ్బందితో ఇంటింటా సర్వే చేస్తున్నాం. అనుమానితులను గుర్తించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం. కుష్ఠు లక్షణాలు ఉంటే చికిత్స అందిస్తాం. బాధితులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తాం. వ్యాధిగ్రస్తులు సరైన మందులు వాడక పోతే ఇతరులకు వ్యాపించే ప్రమాదం ఉంది. సర్వేకు ప్రజలు సహకరించాలి.

– బి.రవీందర్‌రెడ్డి, జిల్లా కుష్ఠు వ్యాధి నియంత్రణ అధికారి

సర్వేకు 557 వైద్య బృందాలు...

- జిల్లాలో మూడు మున్సిపాలిటీలు, 18 మండలాలు, 396 గ్రామాలు ఉన్నాయి. మొత్తం 1,74,491 కుటుంబాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.
- అయితే, కుష్ఠు గుర్తింపు కోసం ఇంటింటా సర్వే చేసేందుకు 557 వైద్య బృందాలను నియమించారు.
- ఇందులో ఏఎన్ఎం, ఆశవర్కర్, మగ వైద్యసిబ్బంది ఉంటారు.
- సర్వేను పర్యవేక్షించేందుకు 115 మంది అధికారులను నియమించారు.
- వీరితోపాటు ఐదుగురు ప్రోగ్రామింగ్ ఆఫీసర్లు, 24 మంది వైద్యాధికారులు నిరంతరం తనిఖీలు చేస్తారు.
- కుటుంబ సభ్యుల శరీరంపై తెల్ల, నల్ల, ఇతర మచ్చలు గుర్తించి నమోదు చేస్తారు.
- అనుమానితులను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులకు రెఫర్ చేస్తారు.
- ఈనెల 16న ప్రారంభమైన సర్వే 31వ తేదీన ముగుస్తుంది.
- సర్వేలో పాలుపంచుకునే సిబ్బందికి ఇప్పటికే వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. వీరు క్షేత్రస్థాయిలో అనుమానితులను గుర్తిస్తారు.

'మాస్టర్‌ప్లాన్'కు వ్యతిరేకంగా రైతుల దీక్ష



రైతులకు మద్దతు పలికిన డీసీసీ అధ్యక్షుడు

నిర్మల్: పంటభూములు కోల్పోయేలా ఉన్న మాస్టర్ ప్లాన్‌ను పూర్తిగా రద్దు చేయాలని బాధిత రైతులు ఆర్డీవో కార్యాలయం ఎదుట శుక్రవారం రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. మంజులాపూర్‌లో నుంచి ఇండస్ట్రీయల్ జోన్‌ను, గాజుల్‌పేట్, విశ్వనాథ్‌పేట్ మీదుగా 200 ఫీట్ల రోడ్డును ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, కానీ తమకు అన్నం పెట్టే భూములను దెబ్బతీయొద్దని కోరారు. మాస్టర్ ప్లాన్ అమలైతే మంజులాపూర్, గాజుల్‌పేట్, విశ్వనాథ్‌పేట్, నాయుడివాడ, బేస్తవార్‌పేట్, బంగల్‌పేట్ తదితర ఏరియాలకు చెందిన రైతులు నష్టపోతారని తెలిపారు. దీక్షలో రైతులు కొట్టె శేఖర్, దొంతుల రవి, అనుముల మోహన్, తోట రవి, బోడ శ్రీనివాస్, కాళ్ల సంతోష్, కొబ్బయ్ శ్రీనివాస్, ఆదుముల్ల సంతోష్, అనుముల సంతోష్, అయిండ్ల గంగయ్య, చెనిగారపు చిన్నయ్య, కిషన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు. దీక్షకు డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు మద్దతు తెలిపారు. రైతులు, ప్రజల పక్షాన కాంగ్రెస్ పోరాడుతుందని అన్నారు.

వారానికి వంద యూనిట్లు గ్రౌండింగ్ చేయాలి

- గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ అధికారులు

నిర్మల్ రూరల్: ప్రతీవారం వంద గొర్రెల యూనిట్లు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులకు సూచించారు. హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తెలంగాణకు హరితహారం, గృహలక్ష్మి, ఇంటి పట్టాల పంపిణీ, జీవో 59, నోటరీ భూముల క్రమబద్ధీకరణ, బీసీ, మైనారిటీలకు ఆర్థికసాయం గొర్రెల పంపిణీ, కారుణ్య నియామకాలు వంటి పలు అంశాలపై సమీక్షించారు. ఆగస్టు 26న రాష్ట్రవ్యాప్తంగా కోటి మొక్కలు నాటాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. జిల్లాకు కేటాయించిన లక్ష్యం ప్రకారం మొక్కలు నాటేందుకు స్థలాలు గుర్తింపు, గుంతల తవ్వకం చేపట్టాలన్నారు. గొర్రెల కొనుగోలు, లబ్ధి దారులకు పంపిణీ, గొర్రెలకు బీమా సౌకర్యం కల్ప న, తదితర అంశాలు పకడ్బందీగా జరగాలని సూచించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు రెగ్యులరైజేషన్ పత్రాలు పంపిణీ చేయాలన్నారు. జిల్లాలో 17 కారుణ్య నియామకాలు పూర్తి చేయాలని సూచించారు. గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

ఎక్సైజ్‌శాఖకు 'లక్కీడ్రాప్'

- చివరిరోజే 701 జిల్లాలో దరఖాస్తులు
- జిల్లాలో మొత్తం 1,019 దరఖాస్తులు
- అబ్కారీకి రూ.20 కోట్లకు పైగా ఆదాయం



టెండర్లు స్వీకరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

నిర్మల్: మొన్నటిదాకా వెలవెలబోయిన మద్యం టెండర్లకు 'లక్కీడ్రాప్' లెక్క చివరిరోజు ఫుల్‌కిక్కు వచ్చింది. జిల్లాలో మొత్తం 47 వైన్సులకు 1,019 దరఖాస్తులు రాగా, అందులో చివరిరోజైన శుక్రవారం ఏకంగా 701 దరఖాస్తులు రావడం విశేషం. గతేడాది మొత్తం 556 మాత్రమే రాగా ఈసారి 443 అదనంగా వచ్చాయి. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి 11 గంటల వరకూ దరఖాస్తులు స్వీకరించారు. నిబంధనల ప్రకారం సమయానికి ముందు వచ్చిన వారికి టోకెట్లు ఇచ్చి, టెండర్లను స్వీకరించారు. అసిస్టెంట్ కమిషన్ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ సంపత్‌కృష్ణ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఫుల్ కిక్కు..

అబ్కారీశాఖ ఊహించినదానికంటే ఈసారి ఎక్కువ టెండర్లు వచ్చాయి. నిర్మల్ సర్కిల్‌లో 29 మద్యం దుకాణాలకు 729, భైంసా సర్కిల్‌లో 18 వైన్సులకు 290 టెండర్లు వచ్చాయి. మొత్తం 1,019 దరఖాస్తులకు రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.20,38,00,000 ఆదాయం చేకూరింది.

శాంతినగర్ వైన్స్ టాప్.. గొల్లమాడ లాస్ట్..

జిల్లాలో అత్యధిక టెండర్లు నిర్మల్‌లోని శాంతినగర్ చౌరస్తాలోని వైన్స్‌కు రావడం గమనార్హం. ఈ మద్యందుకాణంపై ఏకంగా 74 మంది టెండర్లు వేశారు. కొత్త ఏరియా అయినప్పటికీ సేల్స్ పెంచడంలో సక్సెస్ కావడంతో ఈసారి మద్యం వ్యాపారుల నజర్ ఈ వైన్స్‌పై పడింది. ఇక అత్యల్ప దరఖాస్తులు కుంటాల మండలంలోని గొల్లమాడ వైన్స్‌కు వచ్చాయి. ఇక్కడ కేవలం ఒక్కటే దరఖాస్తు రావడం విశేషం. రెండేళ్లక్రితమే ఇక్కడ కొత్తగా వైన్స్ ఏర్పాటు చేశారు. ఒకప్పుడు పెద్ద బెల్ట్‌షాప్‌గా పేరున్న గొల్లమాడలో వైన్స్ ఏర్పాటైన తర్వాత ఇంత తక్కువగా టెండర్లు రావడం చర్చనీయాంశంగా మారింది.

క్లుప్తంగా

ఇంకుడు గుంతల పరిశీలన



ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న పీడీ విజయలక్ష్మి

పెంబి: నిర్ణయించిన గడువులోగా గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలు పూర్తి చేయాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్కూళ్లు, గ్రామ పంచాయతీల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలని సూచించారు. వర్షపు నీటిని భూమిలో ఇంకించేందుకు ఇంకుడు గుంతల నిర్మాణాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో రత్నాకర్‌రావు, టీఏలు, ఎఫ్‌ఏలు ఉన్నారు.



రామ్‌శ్రీను తన కెమెరాలో బంధించిన నిర్మల్ జిల్లాలోని ప్రకృతి అందాలు



వాస్తాపూర్ జలపాతం వద్ద పర్యాటకుల సందడి - నిర్మల్ ఫొటోగ్రాఫర్



నిర్మల్ జిల్లా మహబూబాబాద్ అందాలు - నిర్మల్ ఫొటోగ్రాఫర్

పచ్చని కోనసీమ అందాలను తలపిస్తున్న నిర్మల్ జిల్లా లక్ష్మంపూర్ శివారు ప్రాంతం



చెదరని జ్ఞాపకం

- భావితరాలకు సంస్కృతిని తెలుపే సాధనం
- మనసులోని భావాలకు ప్రతిరూపమే దృశ్యం
- ఫొటోలు, సెల్ఫీలకు పెరుగుతున్న ప్రాధాన్యం
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం..

నిర్మల్ ఖిల్లా: ఒక్క ఫొటోతో ఎన్నో మధుర జ్ఞాపకాలు కదలాడుతాయి. కాలం గిర్రున తిరుగుతున్నప్పటికీ ఫొటో చూడగానే వెనక్కి వెళ్లి ఏండ్ల కిందటి మధురస్మృతులు మనసులో మెదలుతాయి. సంతోషం.. బాధలు .. మధుర ఘట్టాలు .. సాధించిన విజయాలు.. అద్భుత సన్నివేశాలు .. కాలానుగుణంగా ప్రకృతిలో చోటుచేసుకునే మార్పులను బంధించి పదిలంగా దాచుకొని మళ్లీమళ్లీ చూసుకునే అవకాశం ఫొటోతోనే సాధ్యం. అందుకే మిత్రులు, కుటుంబ సభ్యులతో ఏ ప్రాంతానికి వెళ్లినా అక్కడ ఓ ఫొటోనో, సెల్ఫీనో తీసుకోవడానికి ఉబలాటపడుతుంటారు. ఇన్ని అందమైన గుర్తులను మదిలో ముద్రించే ఈ ఫొటోగ్రఫీ కోసం ప్రపంచ వ్యాప్తంగా ఆగస్టు 19వ తేదీన ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని జరుపుకుంటారు.

అరచేతిలోనే కెమెరా...

గతంలో కెమెరా ఉంటేనే ఫొటోగ్రఫీ చేయడానికి అవకాశం ఉండేది. కానీ ప్రస్తుత కాలంలో స్మార్ట్ మొబైల్ ఫోన్లు అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరి చేతిలో కెమెరాలు వచ్చేశాయి. ప్రతీ ఒక్కరు ఛాయా చిత్రాలను సేకరించడం భద్రపరచుకోవడం పరిపాటిగా మారింది. ఈ దశలో తమ సృజనాత్మకతకు పదును పెట్టేలా, వివిధ రకాలుగా తమ అభిరుచులకు అనుగుణంగా భిన్న కోణాల్లో ఫొటోలు తీస్తూ వీక్షకులకు అందుబాటులో పలు మాధ్యమాల్లో ఉంచుతున్నారు.

నిక్షేప్ కెమెరాలో బంధించిన చిత్రాలు



శ్రీనివాస్ కెమెరాలో బంధించిన పక్షులు

భావితరాలకు అందించేందుకు..



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు థోండి శ్రీనివాస్. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఇతడికి ఫొటోగ్రఫీ, వీడియో చిత్రీకరణ అంటే అమితమైన ఇష్టం. వీరు సంస్కృతి సంప్రదాయాలు, చారిత్రాత్మక ప్రాంతాలు, జాతరలు పండగలు వంటి వాటిని ఫొటోలు, వీడియోల రూపంలో చిత్రీకరిస్తూ తన అభిరుచిని ప్రదర్శిస్తున్నాడు. ఇప్పటి వరకు జిల్లాలోని అనేక చారిత్రక కోటలు, పల్లె ప్రాంతాలు, స్థానిక సంప్రదాయ జాతరలను ఫొటోలు, వీడియోలుగా మలిచి పలు సామాజిక మాధ్యమాల్లో నిక్షిప్తం చేస్తున్నాడు. ఇప్పటివరకు వందలాది ఛాయా చిత్రాలు, వీడియోలను చిత్రీకరించి వాటిని సామాజిక మాధ్యమం ద్వారా వీక్షకులకు అందుబాటులో ఉంచుతున్నాడు.

నాకున్న అభిరుచే వృత్తిగా మారింది



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు రామ్ శ్రీను, జిల్లా కేంద్రానికి చెందిన ఇతడికి ఫొటోగ్రఫీ అనేది అతడి జీవన విధానంలో భాగమైంది. వృత్తిపరంగా, అభిరుచి పరంగా ఫొటోగ్రఫీనే ఆశగా, శ్వాసగా మారింది. క్రమంగా అతడికి ప్రకృతి సంబంధిత చిత్రాలు, అరుదుగా కనిపించే లొకేషన్లు, ప్రత్యేకతను సంతరించుకున్న చిత్రాలను సేకరించి భద్రపరుచుకోవడం అలవాటుగా మారింది. ఎక్కడ ఏ సన్నివేశాన్ని అయినా కెమెరాలో బంధించడం తనకు అలవాటుగా మారింది. సాధారణ చిత్రాలను సైతం విభిన్న కోణంలో తీసి తన సృజనాత్మకతను ప్రదర్శిస్తున్నాడు.





నిక్షేప్ కెమెరాలో బంధించిన చిత్రాలు



శ్రీనివాస్ తీసిన నిర్మల్ ఖిల్లా దృశ్యరూపం

బాసరలో భక్తుల రద్దీ



అమ్మవారి ఆలయంలో భక్తుల రద్దీ

భైంసా: శ్రావణ మొదటి శుక్రవారం సందర్భంగా బాసర శ్రీజ్ఞాన సరస్వతీదేవి ఆలయంలో భక్తుల రద్దీ కనిపించింది. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వేకువజాము నుంచే అమ్మవారి దర్శనానికి భక్తుల రాక కనిపించింది. గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులంతా అక్కడే సూర్యేశ్వర స్వామి ఆలయంలోనూ పూజలు చేశారు. తర్వాత సరస్వతీ దేవి ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. చిన్నారులతో అక్షరశ్రీకార పూజలు చేయించారు. మరోవైపు శ్రావణ తొలి శుక్రవారం సందర్భంగా ఆలయంలో సరస్వతీ అమ్మవారికి, మహాలక్ష్మీ అమ్మవారికి, మహాంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీకి తగ్గట్లుగా ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో విజయరామారావు వెల్లడించారు.

డబుల్‌బెడ్‌రూం పరిసరాల్లో
ఎలుగుబంటి సంచారం

ఖానాపూర్: పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలో డబుల్ బెడ్‌రూం పరిసర ప్రాంతాల్లో ఎలుగుబంటి సంచారంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. సమీపంలోని వ్యవసాయ పంటపొలాల్లో పలువురు రైతులు ఇటీవల ఎలుగుబంటి సంచారాన్ని చూసినట్లు పేర్కొంటున్నారు. తాజాగా గురువారం అర్ధరాత్రి నివాస ప్రాంతాల్లోని ఏ1 బ్లాక్‌లో ఉండే పలువురు ఎలుగుబంటిని గమనించి కేకలు వేయగా అక్కడి నుంచి వెళ్లిపోయింది. సంబంధిత అటవీశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుని జనావాసాల్లోకి ఎలుగుబంటి రాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ఎలుగుబంటిని పట్టుకుని అటవీప్రాంతంలో వదిలిపెట్టాలని విన్నవిస్తున్నారు.

నిర్మల్ బంద్ సంపూర్ణం



బంద్‌కు సహకరించాలని కోరుతున్న బీజేపీ నాయకులు

నిర్మల్: మాస్టర్‌ప్లాన్ రద్దు చేయాలంటూ మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు మద్దతుగా శుక్రవారం చేపట్టిన నిర్మల్ బంద్ సంపూర్ణంగా జరిగిందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ముందురోజే బంద్‌కు పిలుపునిచ్చిన నేతలు శుక్రవారం ఉదయాన్నే జిల్లాకేంద్రంలో బైక్‌ర్యాలీగా వెళ్లి బంద్ చేయాలని కోరారు. చాలాచోట్ల వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. విద్యాసంస్థలూ మూసివేశారు. పోలీసులు అక్కడక్కడ బలవంతంగా వ్యాపార సంస్థలను తెరిపించే ప్రయత్నం చేస్తున్నారన్న సమాచారంతో సీనియర్‌నేత రావుల రాంనాథ్, కార్యకర్తలు వెళ్లి వారితో వాగ్వాదానికి దిగారు. బంద్‌కు సహకరించకుంటే జరిగే పరిణామాలకు మంత్రి బాధ్యత వహించాల్సి ఉంటుందని పోలీసులను హెచ్చరించారు. ప్రశాంతంగా జరుగుతున్న బంద్‌ను కొనసాగేలా చూడాలని కోరారు. కొన్నిచోట్ల నాయకులను పోలీసులు అడ్డుకున్నారు.

లక్ష్మణచాందలో..

లక్ష్మణచాంద: నిర్మల్ మాస్టర్ ప్లాన్ రద్దు చేయాలని బీజేపీ తలపెట్టిన నిర్మల్ బంద్‌కు లక్ష్మణచాంద నాయకులు, వ్యాపారులు కూడా మద్దతు ఇచ్చారు. స్వచ్ఛందంగా మండల కేంద్రంలోని వ్యాపార సముదాయాలు మూసి వేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ నిర్మల్ మాస్టర్ ప్లాన్ వెంటనే రద్దు చేయాలని కోరారు. ఇందులో ఎంపీటీసీ నర్సారెడ్డి, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు రంజిత్, నాయకులు రాజు, గంగాధర్, చిన్న రాంరెడ్డి, శంకర్ పాల్గొన్నారు.



పోలీసులతో బీజేపీ నేతల వాగ్వాదం



మండల కేంద్రంలో మూసి ఉన్న షాపులు

క్లుప్తంగా

అన్నాభావు సాఠే జయంతి



జయంతిలో పాల్గొన్న గ్రామస్తులు

కుంటాల: అన్నాభావు సాఠేను ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలని అన్నాభావు సాఠే కమిటీ తాలూకా అధ్యక్షుడు ఉత్తం బాలేరావు అన్నారు. శుక్రవారం మండలంలోని లింబా(కె) గ్రామంలో అన్నభావు సాఠే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆనందరావు పటేల్, ఎంపీటీసీ సునంద గిరీశ్, డైరెక్టర్లు గోనె గజ్జారాం, గంగాధర్, సభ్యులు ఆనందరావు, కైలాస్, అడెల్లు, రవి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ వివరాలు చెప్పొద్దు

కుంటాల: అపరిచితులకు ఆధార్, బ్యాంక్ వివరాలు, ఫోన్‌కు వచ్చే ఓటీపీలు చెప్పవద్దని ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఓలా గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సర్పంచ్ ఫాతిమా, ఏఎస్సైలు రాందాస్, దేవ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే ధ్రువపత్రాలు ఇవ్వండి

కుంటాల: ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారికి కాకుండా అర్హులకే ఎస్టీ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని నాయక్‌పోడ్ కమిటీ సభ్యులు శుక్రవారం తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం కమిటీ మండల కన్వీనర్ కల్యాణ్ గజేందర్, సభ్యులు రమేశ్, భూమన్న, భాస్కర్, వినోద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా ప్రవీణ్‌కుమార్



భైంసారూరల్: భైంసా తహసీల్దార్‌గా ప్రవీణ్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన చంద్రశేఖర్‌రెడ్డి బదిలీపై శంకర్‌పేట్ వెళ్లారు. మావల డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ పదోన్నతిపై భైంసా తహసీల్దార్‌గా వచ్చారు. ఈ సందర్భంగా సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

'మహిళలకు రక్షణ కరువు'

ఖానాపూర్: బీఆర్ఎస్ పాలనలో మహిళలకు రక్షణ కరువైందని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ అన్నారు. శుక్రవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గిరిజన మహిళపై పోలీసులు థర్డ్‌డిగ్రీ ప్రయోగించిన ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. బాధ్యులను ఉద్యోగం నుంచి తొలగించాలన్నారు.

బోదకాలుపై అవగాహన



ఏఎస్పీకి అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

భైంసా: బోదకాలు నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యులు ఫిర్దోస్‌జబీన్ అన్నారు. శుక్రవారం భైంసా పోలీస్‌స్టేషన్‌లో బోదకాలు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, డాక్టర్ కామ్లేశ్, హెచ్ఈఓ కలీమొద్దీన్, సూపర్‌వైజర్ రాణి, హెల్త్ అసిస్టెంట్ అజయ్, సిబ్బంది ఉన్నారు.

'జాన్సన్ వెంటే నడుస్తాం'

కడెం: మండలంలోని కొండుకూర్, మాసాయిపేట్, దిల్దార్‌నగర్, నవబ్‌పేట్, పాండ్వపూర్, కల్లెడ, అంబారిపేట్, చిట్యాల్, చిన్నబెల్లాల్ గ్రామాల సర్పంచ్‌లు బీఆర్ఎస్ నాయకుడు జాన్సన్‌నాయక్‌ను ఖానాపూర్‌లోని తన నివాసంలో కలిశారు. ఇన్ని రోజులు ఎమ్మెల్యే రేఖానాయక్ నాయకత్వంలో పని చేశామని.. ఇప్పటి నుంచి జాన్సన్ నాయకత్వంలో పనిచేస్తామన్నారు. సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు వేణుగోపాల్, తదితరులు ఉన్నారు.

'అర్హులకు ఇళ్లు ఇవ్వండి'

భైంసా: నియోజకవర్గంలో అర్హులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని తెలంగాణ జన సమితి విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని విశ్రాంతి భవనంలో నిర్వహించిన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం గృహలక్ష్మి పథకం పేరిట మభ్యపెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. తులసీరామ్, మినాజ్, అలీంఖాన్, రాజు, శ్రీనివాస్, అశోక్, కృష్ణ, సాబిర్‌బాషా తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల పునరుద్ధరణ

భైంసారూరల్: మండలంలోని ఇలేగాం, సిరాల శివార్లలో జరుగుతున్న స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల పునరుద్ధరణ పనులను ఎస్ఈ జయవంత్ చౌహాన్ శుక్రవారం పరిశీలించారు. ఇటీవల వర్షాలకు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు కొట్టుకుపోగా వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సిరాల ప్రాజెక్టు తెగిపోవడంతో విద్యుత్‌శాఖకు భారీగా నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. మిగిలిన పనులు త్వరగా పూర్తిచేయిస్తామన్నారు. ఆయన వెంట ఏఈ అజీమ్, సిబ్బంది ఉన్నారు.

మణిద్వీప వర్ణన పారాయణం

• ఆలయాల్లో పూజలు చేసిన మహిళలు



ఖానాపూర్‌లోని వాసవీమాత ఆలయంలో..



కుభీర్‌లో పారాయణం చేస్తున్న మహిళలు

ఖానాపూర్: పట్టణంలోని వాసవీమాత ఆలయంలో శుక్రవారం శైవక్షేత్ర వనితా శక్తి ఖానాపూర్‌శాఖ ఆధ్వర్యంలో మణిద్వీప వర్ణన పూజా పారాయణం ఘనంగా నిర్వహించారు. అర్చకులు అభిషేక్‌శర్మ ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు చేపట్టగా జితేందర్, మాధవి, గీతారాణి, సరిత, వాసవి, నీలిమా, మానస, స్రవంతి, వరలక్ష్మి, శ్వేత తదితరులు ఉన్నారు.

కుభీర్: మండల కేంద్రంలోని విఠలేశ్వర మందిరంలో వనితా శక్తి కుభీర్‌శాఖ ఆధ్వర్యంలో మణిద్వీప వర్ణన పారాయణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు తమ కుటుంబం, పతులు సంతోషంగా ఉండాలని కోరుకుంటూ లలితాదేవి గౌరమ్మలకు తొమ్మిది దీపాలు వెలిగించి పూజలు చేశారు. కార్యక్రమంలో వనితాశక్తి జిల్లా అధ్యక్షురాలు రెడిశెట్టి ప్రణీత, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని హరిహర క్షేత్రం మల్లనగుట్టలో గాల లలితా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం మణిద్వీప వర్ణన పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోదమ్మ –మురళీధర్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. వారు మాట్లాడుతూ మణిద్వీప వర్ణణ పారాయణం చేస్తే ఇంట్లో దోషాలు తొలగి సకల శుభాలు కలుగుతాయని పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

సామూహిక సత్యనారాయణ వ్రతం

మామడ:మండలంలోని పొన్కల్ కొత్త చెరువు వద్ద శుక్రవారం వీడీసీ ఆధ్వర్యంలో గ్రామస్తులు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువు వద్ద ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి ఏటా చెరువు నీటి విడుదలకు ముందు గ్రామస్తులు పూజలు చేయడం ఆనవాయితీ. కార్యక్రమంలో సర్పంచ్ భూమేశ్వర్, అశోక్, ముత్యంరెడ్డి, జనార్దన్, బక్కన్న తదితరులు ఉన్నారు.



నిర్మల్‌లో వేడుకలో పాల్గొన్న వినోదమ్మ, భక్తులు

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

• ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

తానూరు: బీఆర్ఎస్ హయాంలోనే ఆలయాల అభివృద్ధి జరుగుతుందని ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వాడ్‌వన గ్రామంలో రూ.22 లక్షలతో చేపట్టే మహాలక్ష్మీ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా గ్రామంలో సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా దశలవారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. త్వరలో టెండర్లు వేయించి గ్రామంలో బ్రిడ్జి నిర్మాణం చేపడుతామన్నారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు బాశెట్టి రాజన్న, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోతారెడ్డి, కోఆప్షన్ సభ్యులు గోవింద్‌రావుపటేల్, సర్పంచ్ సునీత, బాబురావు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

ముథోల్‌కు డిగ్రీ కళాశాల మంజూరు చేయడంపై హర్షం..

భైంసా: నియోజక వర్గ కేంద్రమైన ముథోల్‌కు ప్రభుత్వం డిగ్రీ కళాశాల మంజూరు చేయడంపై బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అఫ్రోజ్‌ఖాన్, సురేందర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖాలీద్, విఠోలితండా సర్పంచ్ విజేశ్, శ్రీనివాస్‌గౌడ్, పోతన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా సర్దార్ పాపన్నగౌడ్‌కు నివాళి



కడెంలో నివాళులర్పిస్తున్న నాయకులు



లోకేశ్వరంలో..



దస్తురాబాద్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

కడెం: దళిత, బహుజనులంతా ఏకమై పోరాడితే రాజ్యాధికారం సొంతమని చాటి చెప్పిన పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని ఎంపీపీ అలెగ్జాండర్ అన్నారు. మండలకేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సర్వాయి పాపన్న గౌడ్ 373వ జయంతి నిర్వహించారు. కాంగ్రెస్, బీఎస్పీ నాయకులు సైతం పాపన్న విగ్రహానికి నివాళులర్పించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేశ్, బీఎస్పీ నాయకులు బన్సీలాల్, రాజేశ్, గౌడ కులస్తులు రాముగౌడ్, తిరుపతిగౌడ్, రవిగౌడ్, రాముగౌడ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

భైంసారూరల్: భైంసా పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం ఆవరణలో శుక్రవారం బీసీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సర్వాయి పాపన్నగౌడ్ జయంతి నిర్వహించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు 60 సీట్లు ఇచ్చే పార్టీలకు తమ మద్దతు ఉంటుందని వారు పేర్కొన్నారు. లక్ష్మీనారాయణ, రమేశ్, ముత్యం తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: మండల కేంద్రంలోని గౌడ సంఘం భవనంలో పాపన్నగౌడ్ జయంతి నిర్వహించారు. గౌడ సంఘం మండల అధ్యక్షుడు శంకర్‌గౌడ్, స్వామిగౌడ్, రమేష్‌గౌడ్, భూమాగౌడ్, ముత్తగౌడ్, నరేష్‌గౌడ్, నాగేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

దస్తురాబాద్: మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న జయంతి నిర్వహించారు. ఎంపీపీ సింగరి కిషన్, వైస్ ఎంపీపీ రాజునాయక్, శివయ్య, శ్రీనివాస్, అంజన్న, సత్యంగౌడ్, రాజాగౌడ్, కిషన్‌గౌడ్, తిరుపతిగౌడ్, హన్మగౌడ్, సాగర్‌గౌడ్, సత్యగౌడ్ పాల్గొన్నారు.

సారంగాపూర్: మండల కేంద్రంలోని ఊరగుట్ట ఎల్లమ్మ గుడి వద్ద పాపన్న జయంతి నిర్వహించారు. గౌడసంఘం నాయకులు ప్రవీణ్, చంద్రమోహన్, లక్ష్మీనారాయణ, ఎల్లాగౌడ్, నవీన్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

భూమిపూజ

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని తండాలో శుక్రవారం రూ.18లక్షలతో చేపట్టే సేవాలాల్ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆత్మ డైరెక్టర్ సప్పల రవి, పాల్దె అనిల్, బీఆర్ఎస్ నాయకులు కోడె నవీన్, అశోక్, గోపి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కుంటాల: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మండల ప్రత్యేకాధికారి మసార్ రావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలో ని అందాకూర్‌లో డ్రై డే నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, సర్పంచ్ దాసరి కిషన్, ఎంపీటీసీ మధుకర్, కార్యదర్శి రమ్య పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ అందజేత

లోకేశ్వరం: మండలంలోని రాయాపూర్‌కాండీ, పుస్పూర్ గ్రామాల్లో మురుగు కాలువలకు రూ.రెండు లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మాజీ జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ ప్రొసీడింగ్ పత్రాలను గ్రామస్తులకు అందజేశారు. రత్నాకర్‌రావు, భోజన్న, కపిల్, శ్యాంసుందర్, సాగర్, శ్రీనివాస్‌రెడ్డి, బండి ప్రశాంత్ ఉన్నారు.

మహనీయుల సేవలు చిరస్మరణీయం

కుంటాల: మహనీయుల సేవలు చిరస్మరణీయమని శాంతినికేతన్ ప్రిన్సిపాల్ సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. కుంటాల శాంతినికేతన్ పాఠశాలలో శుక్రవారం సుభాష్ చంద్రబోస్ వర్ధంతి, సర్వాయి పాపన్న గౌడ్ జయంతి నిర్వహించారు.

మంత్రి కృషితోనే స్వగ్రామానికి మృతదేహం

సారంగపూర్: మండలంలోని కౌట్ల(బి)కి చెందిన బిజ్జారం రమేష్ దుబాయ్‌లో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి.. కేటీఆర్ సాయంతో దుబాయ్ ఎంబసీతో మాట్లాడి మృతదేహం స్వగ్రామం రప్పించారని ఎంపీపీ మహిపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ రప్పించారని ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు.

బీఎల్‌వోలకు అవగాహన

లోకేశ్వరం: బీఎల్‌వోలు విధులను సక్రమంగా నిర్వర్తించాలని తహసీల్దార్ మోతీరాం అన్నారు. శుక్రవారం మండలంలోని పంచగుడి, ధర్మోర, వట్టోలి, జోహర్‌పూర్, అబ్దుల్లాపూర్, కన్కపూర్‌లోని పోలింగ్‌బూత్ కేంద్రాలను పరిశీలించారు. ఆర్ఐ బాలకిషన్, ఆయా గ్రామాల బీఎల్‌వోలు పాల్గొన్నారు.

27న పద్మశాలీల వివాహ పరిచయ వేదిక

కుభీర్:హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 27న జరిగే పద్మశాలి ఎన్ఆర్ఐ వివాహ పరిచయ వేదికను ఎన్ఆర్ఐ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని పద్మశాలి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బూర ఉమాశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు తమ బయోడేటాతో రావాలని ఎన్ఆర్ పద్మశాలీ యువతకు సూచించారు.

కుంటాలకు కళాశాల మంజూరుపై హర్షం

కుంటాల: కుంటాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కళాశాల ఏర్పాటుకు కృషి చేసిన మంత్రి ఐకేరెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక సర్పంచ్ సమత, జెడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి బుచ్చన్న, బీఆర్ఎస్ మండల కన్వీనర్ దత్తాద్రి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఇలేగాం విద్యార్థికి సన్మానం

భైంసారూరల్: భైంసా మండలం ఇలేగాం గ్రామానికి చెందిన పుప్పాల వినయ్ ఎన్ఐటీలో సీటు సాధించాడు. శుక్రవారం ఆయనను భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పవార్ రామారావుపటేల్ సన్మానించారు.

'ఎస్టీ వర్గీకరణ జోలికి రావొద్దు'

సారంగపూర్: ఎస్టీ వర్గీకరణ జోలికి వస్తే పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని తండాల్లో అడుగు పెట్టనివ్వమని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు పవార్ రాజేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఎస్టీలపై ప్రేమ ఉంటే రాజ్యాంగం కల్పించిన హక్కులను అందేలా చూడాలి.. కానీ వర్గీకరణ పేరిట రాజకీయాలు చేస్తే సహించేది లేదని అన్నారు. కార్యక్రమంలో ఉత్తం, కైలాశ్ తదితరులు ఉన్నారు.

నేడు ముథోల్‌లో 5కే రన్

భైంసా: కలెక్టర్, ఎన్నికల అధికారి వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఐ ఓట్ ఫర్ ష్యూర్ అనే అంశంపై ఈనెల 19న శనివారం నిర్వహించే 5కే రన్‌ను విజయవంతం చేయాలని ముథోల్ తహసీల్దార్ అతికొద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6:30 గంటలకు ముథోల్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా బాసర రోడ్డు నుంచి నిర్వహించే 5కే రన్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

నేడు నిర్మల్‌కు 'బండి' రాక

నిర్మల్: మాస్టర్‌ప్లాన్ రద్దుచేయాలంటూ మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి చేపట్టిన ఆమరణ నిరాహారదీక్షకు సంఘీభావం తెలిపేందుకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ శనివారం రానున్నారని పార్టీ ప్రకటించింది. కరీంనగర్ నుంచి మధ్యాహ్నం బయలుదేరి, సాయంత్రం నిర్మల్ చేరుకుంటారని నాయకులు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు రావాలని కోరారు.

గ్రామాల్లో డీఎఫ్‌వో పర్యటన

పెంబి: మండలంలోని మెరోస్ పరుపు నుంచి కోసగుట్ట గ్రామం వరకు అటవీ ప్రాంతం మీదుగా బీటీ రోడ్డు నిర్మాణానికి అనుమతుల విషయమై డీఎఫ్‌వో సునీల్ హిరామత్ శుక్రవారం క్షేత్ర పర్యటన చేశారు. లోతర్యతాండా, గుమ్మెనలో బీఎస్ఎన్ఎల్ టవర్ అనుమతుల కోసం బీఎస్ఎన్ఎల్ సబ్ ఇంజినీర్ రమ్య జ్యోతితో కలిసి ఆయా గ్రామాల్లో స్థలం పరిశీలించారు. డీఎఫ్‌వో మాట్లాడుతూ ఆర్అండ్‌బీ ప్రతిపాదనల మేరకు అటవీ మార్గాన బీటీ రోడ్డు గురించి పరిశీలించామని.. ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు. పెంబి ఎఫ్ఆర్‌వో రామకృష్ణ, డీఆర్‌వో ప్రతాప్‌నాయక్, ఎఫ్ఎస్‌వో రవీందర్ ఎఫ్‌బీవో ఉన్నారు.

'రేఖక్క రాకక్క' పోస్టర్ ఆవిష్కరణ

ఖానాపూర్: కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు ఎమ్మెల్యే రేఖానాయక్ యత్నిస్తున్నారని.. ఆమె వస్తే బీఆర్ఎస్ తరహాలో కాంగ్రెస్ పార్టీకి కూడా నష్టం జరుగుతుందని ఏఐసీసీ రీసెర్చ్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్ నాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతిభవనం ఆవరణలో రేఖక్క రాకక్క పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేఖక్క రాకక్క నినాదాన్ని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామన్నారు. హనుమాన్ విగ్రహం వెండి కళ్లను తీసుకెళ్లిన ఎమ్మెల్యే ఇప్పటికీ ఇంద్రవెల్లి మండలం డొంగర్‌గావ్ వెళ్లలేదన్నారు. ఎమ్మెల్యేకు నిజాయితీ ఉంటే వెళ్లి గ్రామస్తులకు సమాధానం చెప్పాలన్నారు. పెందూర్ ప్రభాకర్, మడిగెల గంగాధర్, సతీష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, భీంరావు, ప్రభుదాస్, ఫసిఉల్లా, నందునాయక్, తరి శంకర్ తదితరులు ఉన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దుబ్బాక ఎమ్మెల్యేను కలిసిన న్యాయవాదులు

నిర్మల్‌టౌన్: మాస్టర్‌ప్లాన్‌కు వ్యతిరేకంగా బీజేపీ నాయకులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపేందుకు శుక్రవారం నిర్మల్ వచ్చిన దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావును నిర్మల్ న్యాయవాదులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నిర్మల్ మాస్టర్ ప్లాన్, పలు అంశాలపై చర్చించారు. అనంతరం వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు అంజు కుమార్‌రెడ్డి, వివి రమణారావు, మధుకర్, రమణ, వంశీకష్ణ, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



రఘునందన్‌రావుతో న్యాయవాదులు

గ్రామాల్లో కొనసాగుతున్న సర్వే

సోన్: మండంలోని సాకెర, గంజాల్ గ్రామాల్లో గృహలక్ష్మికి దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి ఎంపీడీవో గడ్డం మోహన్‌రెడ్డి, సిబ్బంది ఇంటి స్థలం, సర్టిఫికెట్లు, ఆధార్ వంటి వివరాలు నమోదు చేసుకున్నారు. కార్యదర్శి మౌనికరెడ్డి తదితరులున్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని పీచర గ్రామంలో ఎంపీవో నసీరుద్దీన్ పర్యటించి గృహలక్ష్మి దరఖాస్తులు పరిశీలించారు. కార్యదర్శి సాయిప్రసాద్ ఉన్నారు.

కడెం: మండలంలోని మాసాయిపేట్‌లో గృహలక్ష్మి దరఖాస్తులను వెరిఫికేషన్ టీం అధికారి, డీటీ చిన్నయ్య పరిశీలించారు. క్షేత్రస్థాయిలో అర్హులను గుర్తిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కుంటాల: మండలంలోని కుంటాల, విఠాపూర్ గ్రామాల్లో అధికారులు గృహలక్ష్మి సర్వే నిర్వహించి వివరాలు సేకరించారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, డీటీ నరేశ్‌గౌడ్, ఎంపీవో రహీం, ఏపీఓ నవీన్, కార్యదర్శులు రాజబాపు, సారిక పాల్గొన్నారు.



సోన్: సాకెరలో సర్వే చేస్తున్న ఎంపీడీవో మోహన్‌రెడ్డి

భైంసా: ముథోల్ మండలంలోని చించాల గ్రామంలో శుక్రవారం గృహలక్ష్మి దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించారు. ఎంపీడీవో సురేశ్‌బాబు, పలువురు సిబ్బంది ఉన్నారు.

యాజమాన్య పద్ధతులతో పత్తిలో లాభాలు

పెంబి: కొన్ని యాజమాన్య పద్ధతులు పాటిస్తే పత్తి పంటలో అధిక లాభాలు వస్తాయని.. అప్పుడు జాతీయ, అంతర్జాతీయంగా ఆన్‌లైన్‌లో అమ్మకాలు చేపట్టవచ్చని మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ సంస్థ ముంబై అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ బద్రుద్దీన్‌ఖాన్ అన్నారు. శుక్రవారం పెంబి రైతువేదికలో వ్యవసాయశాఖ అధికారులతో కలిసి రైతులకు పత్తి పంట మార్కెటింగ్‌పై అవగాహన కల్పించారు. రైతులు ముడి పత్తిని విక్రయించే కన్నా..జిన్నింగ్ చేసిన పత్తిని బేళ్లగా తయారు చేసి అమ్మితే అధిక లాభాలు వస్తాయన్నారు. పంటను తరలించేందుకు రవాణా, గోదాం అద్దెతోపాటు ఇన్సూరెన్సులో సగం సంస్థనే భరిస్తుందన్నారు. దీంతో మార్కెట్‌లో హెచ్చు తగ్గులతో సంబంధం లేకుండా ముందుకొచ్చిన రైతులకు అధిక మద్దతు ధర అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు రాజ్‌కుమార్, గంగాజల, రిలయన్స్ డీపీఎం రాజేందర్, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పొలం వద్దనే రక్త పరీక్షలు

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి గ్రామంలో బోదకాలు నివారణ మందుల పంపిణీతోపాటు ఇంటింటి ఆరోగ్య సర్వే నిర్వహించారు. ఈమేరకు ఆరోగ్య కార్యకర్త శివకృష్ణ రక్తపరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ క్రమంలో కొందరు రైతులు వ్యవసాయ పనులకు వెళ్లడంతో ఆయన కూడా పొలం వద్దకు వెళ్లి రక్త పరీక్షలు చేసి అవసరమైన మందులు అందించారు.



రైతుకు పరీక్ష చేస్తున్న సిబ్బంది

గోవధశాల తరలించాలని వినతి

ఖానాపూర్: పట్టణంలోని సాయినగర్ పరిధిలో జనావాసాల నడుమ ఉన్న కసాబ్ గల్లీలోని గోవధశాలను తరలించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. గోవధశాల నుంచి వచ్చే దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. కళేబరాల కోసం కుక్కలు, పందులు, వస్తుడటంతో రోగాలు సోకుతున్నాయని.. వెంటనే అధికారులు సమస్య పరిష్కరించాలని కోరారు. కాసవేణి ప్రణయ్, మాదసు మురళీ, వినోద్, శ్రీనివాస్, గంగవ్వ, రవి, సురేశ్, రాజేందర్, రాజేశ్, లక్ష్మి తదితరులు ఉన్నారు.

దిగుబడి పెంచే పద్ధతులపై అవగాహన

భైంసా: ముథోల్ మండలంలోని తరోడా గ్రామ రైతువేదికలో శుక్రవారం పంట దిగుబడులు పెంచుకునేందుకు పోషకాల సమతుల్యత వినియోగంపై గ్రీన్‌గో న్యూట్రియెంట్స్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ మాట్లాడారు. కాల్షియం థియేసల్ఫేట్ నేల లవనీయత తగ్గించి.. హానికర లవణాలను బయటకు పంపుతుందని అన్నారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. వ్యవసాయాధికారులు భాస్కర్, విలాస్, రైతులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సిద్ధాపూర్‌లో నిర్మించే దుర్గామాత ఆలయానికి దేవాదాయశాఖ రూ.50 లక్షల నిధులను శుక్రవారం మంజూరు చేసింది. దీంతో సిద్ధాపూర్ కాలనీవాసులు హైదరాబాద్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని తన కార్యాలయంలో కలిసి శాలువా, పూల మొక్కతో సన్మానించారు.

కాంగ్రెస్‌లో పలువురు చేరిక

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి చెందిన మైనార్టీ నాయకులు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, ఈటెల శ్రీనివాస్, రాజేశ్వర్, పృథ్వీరాజ్ తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై కళాజాత

సోన్: మండలంలోని గాంధీనగర్‌లో శుక్రవారం సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, కండ్లకలక, మూఢ నమ్మకాలపై కళాజాత నిర్వహించారు. జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారి బి.తిరుమల మాట్లాడారు. వైద్య సిబ్బంది, కళాకారులు ఎలిశెట్టి సుదర్శన్, రఘునాథ్, నాగరాజ్, మాధురి, రాజు, శ్రీలత, లక్ష్మణ్, జితేందర్, తస్లీమా ఉన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

కుభీర్: మండలానికి వచ్చిన నూతన తహసీల్దార్ ఎం.సోమును శుక్రవారం పలువురు సన్మానించారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దావూజీనాయక్ తండా సర్పంచ్ శంకర్, సంజయ్, బిక్కు, లింగన్న ఉన్నారు.

ఐడ్రాప్స్ పంపిణీ

కుంటాల: మండలంలోని దౌనెల్లి తండాలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు జీవి రమణారావు కండ్ల కలక సోకిన 150 మందికి ఉచితంగా ఐ డ్రాప్స్ పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ శ్రావణ్, రవీందర్‌రావు, నరేందర్, రాజు, రమేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.